

# మా అమ్మ పూల యాపారం

మా అమ్మ కోసే సన్నజాజి పూలని లెక్కపెట్టాలని నాకు బలే కోరిక.

మా అమ్మలాగే మద్యానం మూడు గంటలకల్లా మా మిద్దెనెక్కి, మా వరండా శ్లాబుకు పాదలు పాదలుగా అల్లుకున్న మా సన్నజాజి చెట్టు పూలన్నింటినీ నేను కూడా కోయాలనీ, కోసినాక పూవు పూవునా లెక్కబెట్టి నేనే నా సొహస్తాలతో 'పూల రిహోనాబీ'కి అమ్మాలనీ, ఆ వచ్చే డబ్బుల్ని నా సొంతానికి దర్జాగా వాడుకోవాలనీ సత్తె ప్రమాణంగా నాకు బలే కోరిక.

కానీ యాడా? మా అమ్మ తీరనిస్తేగా. నన్ననే కాదు మా అన్ననీ, మా చెల్లెల్నీ ఆఖరికి మా నాయినమ్మని కూడా మా సన్నజాజుల చెట్టు మీద చేయి వేయనీదామె.

ఎందుకంటే మా చెట్టు మా అమ్మ సొంతం. మా అమ్మ కష్టం.

రోజూ మద్యానం మూడు

గెంటలయితే చాలు పెద్ద ఇష్టీలు గిన్నె తీసుకొని మిద్దెనెక్కుతుంది మా అమ్మ. ఆ టయానికి ఆకు కనిపించనంత తెల్లంగా అంగుళం పొడుగు మొగ్గల్ని కాసి, గమగమమనే వాసనలతో మా అమ్మ కోసరం ఎదురుచూస్తా వుంటుంది మా సన్నజాజుల చెట్టు .

మా మిద్దెనెక్కిన ఎమ్మటన్నే పూలు కోయదు మా అమ్మ. ముందర ఇష్టీలు గిన్నెని కింద పెట్టి ఒకసారి కళ్ళారా పూలన్నింటినీ చూసుకుంటుంది. గాలికి అటూ ఇటూ మిడియాలంగా ఊగి చిక్కుబడిన కొమ్మలన్నింటికీ తీరుబడిగా చిక్కులు తీస్తుంది. ఆడాడ యాడైన చిన్న చిన్న ఎండు కొసలు ఉంటే పుటుకు పుటుకున తుంచి కింద పారేస్తుంది.

ఆనేక- ఒక్క తీగ కూడా నలగనంత నాజూకుగా -చెట్టు మీదికి వాలి ఒకో పూవూ ఒకో పూవూ కోస్తా గిన్నెలోకి పోయడం మొదలుపెడుతుంది. మెడ నిలవని పసిబిడ్డని ప్రాణాల్లో పెట్టుకుని ఎత్తుకుంటామే అంత బద్రంగా మా సన్నజాజి కొమ్మల్ని ముట్టుకుంటుంది మా అమ్మ. ఆమె చేతిలో పూలు తెగాలే గానీ ఒక్క పచ్చికొమ్మ కూడా పుటుక్కుమనడానికి లేదు.

పూలు సగానికి కోసేసినాక ఆగి, పూలగిన్నె తట్టు ఓరగా చూసుకుంటుంది మా అమ్మ. అప్పటికి ఉబ్బెత్తుగా సగానికి నిండి వుంటుందది. మిగిలిన సగానికి కూడా నిండేంత పూలున్నాయేమో ఉరామారీగా చూసుకొని మళ్లా కొరవ పూలన్నింటినీ కోసుకుంటుంది.

ఈ కార్యక్రమం అంతా ముగిసేటప్పటికి టైము ఐదయ్యి మా ఇస్కూలు, మా యింటెదురుగా ఉండే గర్లీస్కూలు విడిచిపెట్టేసినా మాఅమ్మ మిద్దె దిగదు! చెట్టులోకి చూస్తానే వుంటుంది పూల కోసరం. మా అమ్మ చూపులో చురుకు బలే జాస్తి. సాయింత్రప్పొట, ఒక తట్టు చీకటి పడతా వున్నా కూడా ఒక్కసారి కళ్లు తిప్పి చెట్టునంతా చూసిందంటే చాలు. గుబురు లోపల, ఆకు మాటున, కొమ్మ నీడలో యాడన్నా ఒక పువ్వు మిగిలినా చాలు మా అమ్మ కంటికి చిక్కిపోతుంది. ఆ ఒక్క పువ్వుని కూడా వదలకుండా కోసేసినాకగానీ మిద్దె దిగదు మా అమ్మ.

అక్కడికి- మా అమ్మ పూలు కోసే కార్యక్రమంలో ఒక అంకం ముగిసి పోతుంది. రెండో అంకం మా పూలని లెక్కబెట్టడం.

మిద్దె దిగినాక, మా వరండా గచ్చుమీద ఒక కాలును సాపుకొని ఒక కాలును మడుచుకొని కుదురుగ్గా కూచుంటుంది మా అమ్మ. అనేక గిన్నెని విదిలిస్తా పూలన్నింటినీ కుప్పగా కిందబోస్తుంది. మెత్తటి శబ్దం చేస్తా యిన్ని పడతాయవి.

ఆ కుప్పలో నుంచి దఫాకు అయిదు పూల లెక్కన యిరవై దఫాలు లెక్కబెట్టి మొత్తం వందపూల కుప్పని పక్కకి జరుపుతుంది మా అమ్మ. అట్టా వంద, వంద, వంద లెక్కన

ఎన్ని కువ్వలైతే అన్ని కువ్వలని వరుసగా పేర్చి పెడ్తుంది.

పేర్చినాక, చూపుడు వేలు సాచి ఒకటి... రెండు... మూడు అంటా కువ్వలన్నింటినీ లెక్కబెడ్తుంది.

మొత్తం పదహారు వందలో, పదిహేడు వందలో వుంటాయవి! (యిన్ని పూలు పూయడం అంటే చిన్న కత కాదు. మాది చలవగల చెట్టు కాబట్టి యిన్ని పూల బాగ్యం పట్టిందిగానీ మా చుట్టుపక్కల సందుల్లో ఏ సన్నజాజి చెట్టయినా ముక్కీ మూలిగీ ఆరేడు వందల పూల కంటే ఎక్కవ పూయదు).

మా అమ్మ మా చెట్టుకు కాసిన (హీనపక్షం) పదహారు వందల పూలని మళ్లా గిన్నెలో పోసుకొని, మా యింటికి పర్లాంగు దూరంలో వున్న 'పూల రిహానాబీ' యింటికి బయలుదేరుతుంది.

దారిలో మా అమ్మ నడస్తా వుంటే ఆమె చేతిలో ఏముందనేది నరమానవుడు కూడా కనిపెట్టలేడు. పొట్ట దగ్గిర, కొంగు కిందుగా కప్పేస్తుంది పూల గిన్నెని- దిష్టి తగలకుండా.

మా అమ్మని చూడంగానే రెండు చేతులూ సాచి గిన్నె అందుకుంటుంది పూల రిహానా. కళ్ళ నిండుగా పూలు చూసుకుంటానే 'ఎన్నకా?' అని అడుగుతుంది.

'పదహారు' అనంటుంది మా అమ్మ.

రిహానా మళ్లా మా పూలని లెక్కబెట్టదు. మా అమ్మ చెప్పిన లెక్కని బట్టి ఎమ్మట్నే డబ్బులిచ్చేస్తుంది.

వంద పూలొచ్చి యిరవై పైసలు! అంటే పదహారు వందల పూలొచ్చి మూడు రూపాయల యిరవై పైసలు!

ఆ మూడు రూపాయల యిరవై పైసలని తీసుకున్నాక, పదిలంగా ముడేసి చీరకొంగులో కట్టుకుంటుంది మా అమ్మ.

అవి మా అమ్మ సొంత డబ్బులు! అదీ మా అమ్మ పూల యాపారం!

నేను ఆరో కిలాస్‌లోకి మారి, మూడు నెలలు గడిచేసరికి పోలేరమ్మ బండకాడ మా నాయిన శ్లాబుబోసి యిల్లు కట్టించినాడుగానీ యిల్లంటే అది పూర్తి యిల్లు కాదు.

ముందొక తలుపు, ఎనకొక తలుపు, లోపల పూతపని.. యింతే చేయించింది. సైతోడికి చెప్పినట్టే మా నాయినతో కూడా 'మొత్తం పదేను వేలతో యిల్లయిపోతుంది కరీం సాయిబా' అని బేల్దారు మాలకొండయ్య లెక్క జెప్పినాడంట, ఆ లెక్కని నమ్మి ఏడు వేల రూపాయలతో అమాయికంగా పనిలోకి దిగినాడు మా నాయిన.

ఆ ఏడయినాయి. డెకరేషన్ లైటింగ్ కోసరం మా దగ్గిరుండే జనరేటరు అమ్మకనూకగా వచ్చిన డబ్బులయినాయి. మా అమ్మ నగలు కుదవయినాయి. యింక ఆ పనీ, ఈ పనీ చేయగా వచ్చిన డబ్బులన్నీ అయినాయి. యిల్లు మాత్రం అవలా. పదేను వేలనుకున్న కట్టుబడి అప్పట్లోనే (కూలోడికి ఆరు, బేల్దారుకు పన్నెండు రూపాయిలిచ్చే సలీసు రోజుల్లో) ముప్పయి వేలకి చేరుకునింది. పెండం రవీలాంటి స్నేయితులూ మా తాత మస్తాన్ సాయిబు లాంటి బందువులూ అడక్కముందరే వచ్చి సహాయం చేసినా తట్టుకోవడం మా నాయిన వల్లగాలా.

వాడమ్మనాయాల్దిగానీ యిప్పటికి ఆరిపోయింది చాలూ నాలుగు డబ్బులు వచ్చినాక మళ్లా చూసుకోవచ్చు అని, కిటికీలకి రెక్కలు కూడా పెట్టించకుండా మమ్మల్ని దించేసినాడు యింట్లో. ఒకసారి పని పెండింగు పడినాక మా నాయిన దరువు తెలిసిందే కదా. 'చూద్దాం చూద్దాం... చేద్దాం చేద్దామే'.

అందుకని మ అమ్మ మా నాయిన్ను నమ్ముకోకుండా 'వాకిలి గోడ ఎత్తుగా లేదు, ఇంటికొక పరదా లేదు, వీదిన పొయ్యే వాళ్లందరికీ మొత్తమంతా అవుపిస్తా ఉంది' అని, మా ఇంటి వాకిట్లో ఈ సనజాజుల చెట్టు నాటింది.

మా అమ్మ చేతి మహిమో, ఆ టైములోని ముహూర్త బలమోగాని, సంవత్సరం ఆరు నెలల్లోనే మా చెట్టు పాకి, పైకి అల్లుకొని, మా వరండా శ్లాబుకి ఈ కొస నుంచి ఆ కొసదాకా పచ్చగా కమ్ముకొనింది. అది ఆకుల పరదాలాగా ఎట్టా అల్లుకునిందంటే బయటి నుంచి చూసేవాళ్లకి మా వరండా సగం కూడా అవుపించేది గాదు.

అప్పట్నించి మా యింట్లో సాయింత్రమయ్యిందంటే చాలు లెక్కలేనన్ని పూలు. గమగమమనే వాసన.

మా పూలని పెట్టుకొని పెట్టుకొని, మా చెల్లెలికి పెట్టీ పెట్టీ, వాళ్ళకీ యీళ్లకీ యిచ్చీ యిచ్చీ యింకీ పూలతో విసిగిపోయినాను తండ్రీ అని మా అమ్మ అనుకుంటా వున్నప్పుడు పూల రిహానా వచ్చింది మా ఇంటికి.

పూలరిహానా అంటే ఆమెవరో షావుకారో, లక్‌పతో అనుకునేరు. గోతాంపట్టా మీద నీళ్లు చల్లుకొని, అయిదు లీటర్లో పదిలీటర్లో పూలని ( మా ఊరిలో పూలని లీటర్లల్లో - అంటే లీటర్ డబ్బాల లెక్కన అమ్ముతారు) ఆ గోతాం పట్ట మీద పోసుకొని మాలలుగా కడ్తా వుంటుందామె. ఆ మాలలని బజారులో వరవకట్టమీద కూచొని వాళ్ళాయన అమ్ముతా వుంటాడు. పూలు అమ్ముడుపోతేనే ఆ రోజుకి జరుగుబాటు. లేకపోతేలా.

వరవకట్ట మీదుండే పూలకొట్లకాడ సనజాజి మూరలకి వున్న డిమాండింగును చూసి, మా చెట్టుని చూసి, మా అమ్మ కాడికి వచ్చిన పూలరిహానా ఆమె బాధనంతా చెప్పుకునింది.

'అకా. నీకు తెలియనిదేముంది. మా యింటాయన అంతంత మాత్రపోడు. బుట్టకు యిన్నేసి వచ్చే బంతి పూలని కొనడానికి కూడా అల్లాడిపోతా ఉన్నాడు. తక్కిన పూల రేట్లు చూస్తా ఉంటే మాబోటోళ్ళం సరుకు వేయించుకునేలా లేము. వేయించుకున్నా పెద్ద పూలకొట్ల మధ్యన కూచొని అమ్ముకునేలా లేము. నువు సనజాజులు యిచ్చినావంటే అవి నాలుగు మూరలు ఇవి నాలుగు అమ్ముకొని ఎట్నో గడుపుకుంటాం. నీ సొమ్ము పుణ్యానికి బళ్లా. వందకి ఇర్వై పైసలిస్తా' అనింది.

ఆమె బాధల కంటే కూడా, వందకి యిర్వై పైసలన్న మాటే మా అమ్మను ఎక్కువ కరిగించింది. 'దానికేం బాగ్యంమే రిహానా. అట్నాగే యిస్తా. నీ కోసరం యియ్యాల్టి నుంచి తల్లో కూడా పెట్టుకోను పో' అని మాటిచ్చింది.

ఇచ్చినాక ఆ రాత్రే, అన్నం తింటా ఉన్న మా నాయినకాడ నెమ్మదిగా యీ సంగతి కదిలేసింది. మా నాయిన బిత్తరపోయినాడు.

'కరీం సాయిబు బార్య పూలమ్మతా వుందని నలగురూ నాలుగు మాటలు అనుకోబోతారు. వద్దులేమ్మే. కావాలంటే ఊరకనే కోసుకొని పొమ్మని చెప్పు' అనినాడు.

మా అమ్మకు కాలిపోయింది.

'నువు ఎంకటగిరి రాజా అయిననాడు అట్నే ఊరకే యిద్దూగానీ ఇప్పుడు మాత్రం నేను పూలమ్మతా నువు గమ్మునుండు. ఒకేల ఏదైనా అనుకునే వాళ్లుంటే అనుకోని. వాళ్లు మనకొక రూపాయి యిస్తారా? మన బాదలేముండాయో అంటా వచ్చి పంచుకుంటారా? అయినా యిందులో దాపరికంలా. దొంగతనంలా. పూలుండాయి... యిస్తా ఉన్నాము. అంతే. మన పూల వల్ల రోజుకి ర్లెండు మూడు రూపాయిలొచ్చినా పాలకి పనికొస్తాయి గదా' అని మా నాయిన మనసు కక్కేలామాట్లాడింది.

మా నాయిన గమ్మునయిపోయినాడు.

ఆ రోజుటాల్నించి మా వీదిలో వాళ్ళకూ మా బందువులకూ కాదుగదా ఆకరికి మా చెల్లెలికి కూడా పుల్లుగా పూల కట కటా. ఒక మొగ్గ పోవడానికి లా. ఒక మొగ్గ రాలడానికి లా. అన్నీ గుత్తంగా తీసకెళ్లి రిహానాబీకి అప్పగించాల్సిందే మా అమ్మ. ఎప్పుడైనా మిద్దె మీద నుంచి గానీ, కింద నుంచి గానీ చేతికందకుండా గుప్పెడు పూలు నడిమధ్యన మిగిలిన పోతే మా అమ్మకు ఎంత బాదో. 'నయా పైసల్రా నాయినా... గాలికి పోతా వున్నాయి' అనేది.

పూల యాపారం మొదలయినాక మా అమ్మ దినచర్యే మారిపోయింది. ఆమె ధ్యాసంతా ఒకో పూవూ ఒకోపూవూ లెక్కన మా చెట్టు కాపు పెంచి యాపారాన్ని ఎట్టా అబివృద్ధి చేయలా అనేదే.

మా ఇంటికి కుడితి నీళ్ళ కోసరం వచ్చే ఒక ఆడమనిషి, కుడితి తీసుకుని గమ్మునపోకుండా 'మోవ్! మీ చెట్టుకి టీ ఆకెయ్. సత్తువ' అని చెప్పిందంట. అప్పట్నించి మొదలయినాయి నా పాట్లు.

నాలుగైదు రోజులకొకసారన్నా, ఇస్కూలు నుంచి రాంగానే 'రే ఖదీరా... స్వామోళ్ల ఓటలుకెళ్ళి టీ ఆకు తేపో' అంటా, ప్లాస్టీకు బకెటును నా చేతిలో పెట్టేది మా అమ్మ. సామీ ఓటల్లో టీ ఆకు మార్చినప్పుడల్లా ఉడికిన ఆకును తీసి రేకుడబ్బాలో పారేస్తారు గదా దాన్ని తేవాలన్న మాట నేను.

ఆడుకునే టయిములో, సామీ ఓటలు కాడికెళ్ళి టీ ఆకు కోసరం నిలబడాలంటే చానా కష్టంగా అనిపించేది నాకు. ఆ టయిములో కిటకిటలాడతా వుంటుంది ఓటలు. అందరూ నిలబడి టీలు తాగతా వుంటారు. వాళ్లందరికీ టీలు ఇచ్చి, యింక తాగేవోడెవ్వడూ లేడనుకున్నాకగానీ మనల్ని టీపోసే బండ కాడికి రానీరు. వాళ్లు రానిచ్చాక గానీ నాపరాయి బండ కిందున్న టీ ఆకును తెచ్చుకునేదానికి లేదు. ఇంత తతంగం వున్నా 'నేను పోనుమా' అని మా అమ్మకు చెప్పేదానికిలా. బియ్యం తేనన్నా సయిస్తుంది గానీ చెట్టుకి టీ ఆకు తేనంటే మాత్రం సయించదు మా అమ్మ.

మా సనజాజుల చెట్టు కుదుళ్ళు ఎప్పుడు చూసినా టీ ఆకు ముద్దలతో తడితడిగా ఉన్నా మా అమ్మకు తృప్తి తీరేది కాదు. చెప్పినానే మా పాతూర్లో రెడ్లా యవసాయం చేసేవోళ్లా ఎక్కువని... అందువల్ల ఏ యింటి ముందరయినా ఎరుపు మట్టితో ట్రాక్టరు ఆగిందంటే చాలు చాటెత్తుకొని సిద్ధమయిపోయేది మా అమ్మ. 'రెండు చాటలే లేమ్మా' అంటా ఒకటికి రెండు చాటలు జవురుకొనొచ్చి మా చెట్టుకు పోస్తేనే ఆమెకు నిశ్చింత.

యిట్టా ఎరుపుమట్టినీ, టీ ఆకునీ నీళ్లతో కలుపుకొని తినీతాగీ మా సనజాజుల చెట్టు బలిసిపోయింది. పూలు కుప్పలు కుప్పలయినాయి. అప్పుడు మళ్ల ఈ కుప్పల కుప్పల పూలను చూసుకొని మా అమ్మకు దిగులుపట్టుకునింది.

'దారినపొయ్యేవోళ్ళంతా మన పూలను చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటా వున్నారు. దిష్టి చూపు తగలితే బండరాళ్లే పగిలిపోతాయి. పచ్చటి చెట్టుదొక లెక్కా' అని మా నాయినమ్మతో చెప్పుకునింది.

ఆ బయం మా నాయినమ్మకు ఆల్రెడీ ఉన్నట్టుంది... మా అమ్మ ఆ మాటని అనీ అనకముందే నల్లటి మట్టికుండ తెప్పించి, దాని మీద సున్నపు బొట్లు పెట్టించి చెట్టు మద్యలోకి దిష్టికి వేలాడదీసింది.

అంతటితో మా అమ్మకు దిష్టి బయం పోయినా యాపార ఒత్తిడి ఎక్కువయ్యింది. తూర్పు వీది ఆడోళ్లు కొత్త కోమిటోళ్ళ ఆడోళ్ళు వచ్చి 'పూలు మాకీరాదా సత్తారా' అంటా ఆబ్లీగేషన్‌లకు వచ్చినారు. (మా అమ్మ పేరు సర్తాజ్. పాతూరులో చేరినాక ఆమె పేరు 'సత్తార' అయిపోయింది - నోరు తిరగక). కొత్త కోమిటోళ్ళ ఆడోళ్ళు యాపార మెళకువలు తెలిసినోళ్ళు కాబట్టి మా పూల రేటును వందొచ్చి ముప్పయ్ పైసలకు పెంచేసినారు, అడ్మాన్స్ పేమెంటును కూడా ఆశ చూపతా.

మా అమ్మ ఒంగలా.

'డబ్బుల కోసరమని కాదమ్మా. పూలు మీకిచ్చినానంటే పాపం మా ఖాతా ఆమె యిబ్బంది పడుతుంది. కావాలంటే రెండు మూడొందలిస్తా తీసుకెళ్ళండి' అనేది. అట్టా రెండు మూడు వందలు, మరీ మొహమాట పెడితే నాల్గైదు వందలతో (వంద పూలు ముప్పయి పైసల లెక్కన) వాళ్లను వొదెగిచ్చుకునేది మా అమ్మ.

అయితే అలా నాల్గైదు వందల పూలు తగ్గినా కూడా రిహానాబీ నిష్ఠూరమాడేది. 'ఏందకా.. నువు రీటయిల్లో అమ్మేస్తే బజార్లో మా మూరలు ఎవురు అడగతారు? ఎవురు కొంటారు?' అని కొసెను చేసేది.

పాపం రిహానాబీ కోసరం మా అమ్మ ఎంత మానుకోవాలన్నా రీటెయిలు బిజినెసులో, ముఖ్యంగా హిందువుల పండగలప్పుడు ఎక్కువ పూలు అమ్మాల్సి వచ్చేది. (ఆ టైములో వంద అర్ధ రూపాయికి అడిగేవోళ్లు మా పూలని. అది రికార్డు రేటు!).

పూలు కోస్తానంటే చెట్టుమీద చెయ్యి వేయనివ్వదుకానీ కాయ దూయడానికి మాత్రం ఒకరికిద్దరిని పిలిచేది మా అమ్మ. సనజాజుల చెట్టుకి కాయకట్టేసిందంటే కాపు పడిపోద్ది గదా. అందుకని మా నాయినమ్మని, నన్ను మిద్దె ఎక్కనిచ్చేది. మేము మా అమ్మతో కలిసి యాడాడ కాయున్నా అదంతా దూసేసేవోళ్లం.

ఈ డూటీ మా నాయినకు కూడా తప్పేది గాదు ఒకోసారి.

ఆయన ఏనాడైనా ఇంట్లో ఖాళీగా వుండి, ఒళ్ళు విరుచుకుంటా ఉంటే మా అమ్మ ఊరుకోకుండా 'అట్టా కాళ్లు సాపుకొని కూచోకపోతే మిద్దెనెక్కి కాయదూయరాదా?' అనేది.

చెట్టు పని గదా. అడ్డం చెప్పేదానికే లా.

గమ్మున మిద్దెక్కి 'యింక చాల్లే.. దా' అనేదాకా కాయ దూస్తానే ఉండేవాడు మా నాయిన.

కాయ దూసేకొద్దీ మరిగిన్ని పూలు పూస్తా వుండేది మా చెట్టు. మా పూల సంఖ్య నెమ్మది నెమ్మదిగా పదిహేడు వందలు, పద్దెనిమిది వందలు ఒకోసారి పందొమ్మిది వందలకు చేరిపోయేది. అయినా గానీ ఏనాడూ నాలుగు పూలకి దారం కట్టి తల్లో పెట్టుకునేది కాదు మా అమ్మ. 'యింకో వంద పూలు కాస్తే అచ్చంగా నాలుగు రూపాయలు చేతిలో పడేవి గదా' అనేది ఆశగా. (రెండు వేల పూలు నాలుగు రూపాయలు).

యిట్టా రెండు వేల పూల లక్షానికి మా యాపారాన్ని అబివృద్ధి చేయాలని మా అమ్మా, మేమూ పాటుపడతావుంటే అప్పుడప్పుడు బందువులు వూడిపడేవోళ్లు మా పూలకి దుష్మన్లయ్యి.

'అంత పెద్ద చెట్టుంచుకొని కూడా నాలుగు పూలియ్యలేదమ్మా ఆ మహాతల్లి' అని ఇంటికొచ్చిన ఆ అమ్మలక్కలు అంటారు గదా... అందుకని ఆ మాట రానీకుండా ఆ రోజు మాత్రం రిహానాబీకి యియ్యాల్సిన కోటాలో రెండొందల పూలు తగ్గించి దగ్గిరుంచుకునేది మా అమ్మ.

ఆ రొండొందల పూలని అట్టానే చేతిలో పెడితే ఎవురికంటికీ ఆనవు కదా. ఆ సంగతి మా అమ్మకు తెలుసు కాబట్టే మా యింటికొచ్చినోళ్ళని నైసుగా మాటల్లో పెట్టి మా పెరట్లోని మరువం రెమ్మల్ని, కనకాంబరాలనీ కోసుకొనొచ్చేది. ఒక వాయ సన్నజాజులు, ఒక వాయ మరువం, ఒక వాయ కనకాంబరాల లెక్కన అన్నింటినీ కలిపి దూరం దూరంగా మాలకట్టేది. అప్పుడు ఆ రొండొందల పూలే రెండు మూడు మూర్లలై యింత పొడవున అవుపించేవి.

యింక మా బందువులూ కుష్. మా అమ్మా కుష్.

ఒకోసారి మా అమ్మ ఏ రోజు డబ్బులు ఆరోజు తీసుకుని కాదు- రిహానా కాణ్ణుంచి. 'అట్టా తీసుకుంటే ఏ పనికీ అక్కరకు రావడం లేదమ్మా. వారం రోజుల డబ్బులు ఒకేసారి యియ్యి' అనేది రిహానాబీతో. వారం రోజుల పాటు వరసగా పూలిచ్చి, ఎనిమిదో రోజున యిరవై అయిదు రూపాయలో ఇరవై ఆరు రూపాయలో తెచ్చుకుని ఆ డబ్బులతో ఇస్టోరులో చక్కెర తెచ్చుకనేది. అట్టా మా పూల డబ్బులు ఒక వస్తువు కోసరంగా ఉపయోగపడితే మా అమ్మ మొకం సంతోషంతో వెలిగిపోయేది.

'చూసినావా నా చెట్టు తడాఖా. నాలుగు రోజులు ఆగు. నా పూల డబ్బులతో అయిదు వేల చీటీ కట్టి చూపిస్తా' అని, మా నాయినతో చతుర్లాడేది మా అమ్మ. మా నాయిన ముసిముసి నవ్వులు నవ్వుకుంటా చూస్తా వుండేవోడు.

కత యిట్టా పూలుపూలుగా జరగతా వుండగా ఒకసారి మా అమ్మకూ, రిహానాకూ తకరారు వచ్చేసింది - యిరవై రూపాయల పూల డబ్బుల కాడ.

'నా అయిదు రోజుల పూల డబ్బులు యిచ్చెయ్ తల్లా. అవతల నాకు అర్జంటు పనుంది' అంటుంది మా అమ్మ.

'యింకో రెండ్రోజులు తాలకా. యీ డబ్బులికి ఆ డబ్బులు కూడా కలిపి మొత్తమంతా యిచ్చేస్తాను' అంటుంది రిహానా. అలా రెండు రోజులు గడిచినాయి. పూల బాకీ యిరవై నుంచి యిరవై ఆరు రూపాయిలయ్యింది. మళ్లా మా అమ్మ డబ్బులడిగింది.

'రేపురా అకా. గారంటీగా యిచ్చేస్తా' అనింది రిహానా.

అట్టాంటి గారంటీలు మళ్లా మూడయినాయి. యింక లాబం లేదనుకొని మరుసటి రోజు మరేదగానే అడిగింది మా అమ్మ- 'ఏందిమే రిహానా. నేను చెట్టు పెంచుకుని, నీళ్ళు పోసుకుని, పురుగు పట్టకుండా ముడత మందు చల్లుకొని, కాయ దూసుకుని, నా పూలని ఒకటికి రెండింతలు చేసుకునింది నీ యదాన కొట్టడానికా? నువు డబ్బులియ్యకుండా ఇట్టా యిబ్బంది పెడితే ఎలాగమే' అనింది.

ఆ మాటలకి రిహానా ఏందో సర్ది చెప్పబోతా ఉంటే వాళ్ళాయన గమ్మునుండబళ్ళా? యింత పొడుగున పొడుచుకొనొచ్చి 'యిచ్చేస్తాములేమ్మా... నీ సంబడం డబ్బులా. రేపు రాపో' అన్నాడు రోషంగా.

అంతే. అదే ఆఖరు. ఆ మరుసటి రోజు నుంచి మా అమ్మ రిహానా ఇంటికే వెళ్లలా. పూలూ యివ్వలా.

చాన్నాళ్ల తరువాత మా అమ్మ తలలో, మా చెల్లెలి తలలో యిన్నేసి పూలు అవుపిస్తా ఉంటే మా నాయిన డౌటు పడి సంగతి తెలుసుకున్నాడు. 'పోనీలేమ్మే పేదరాలు. ఏమి ఇబ్బందుల్లో వుందో ఏమో' అన్నాడు.

మా అమ్మ ఒదల్లా. మనసులోనే పెట్టుకునింది ఆ సంగతిని.

రెండు వారాలు గడిచినాయి.

ఒకరోజు సాయింత్రం తల నిండుగా కొంగు కప్పుకొని బితుకు బితుకుమంటా

వచ్చింది రిహానా.

మా అమ్మ వరండాలో కూచొని ఉంది.

'ఏం తల్లా' అనింది, రిహానా తట్టు తుస్కారంగా చూస్తా.

'డబ్బులిచ్చి పోదామని వచ్చినానకా' అనింది రిహానా.

'మాకేం బల్లేదు పో' అనింది మా అమ్మ.

రిహానా పోలా. గమ్మున్గా వచ్చి మా అమ్మ పక్కన కూచునింది- కళ్ళ నిండా నీళ్లు నింపుకుంటా.

'సేయ్ పిచ్చిదానా' అనింది మా అమ్మ, రిహానా కళ్లల్లో నీళ్లు చూసి.

'అకా. సత్తెం చెప్తా ఉన్నా. ఇన్ని రోజులు నీకాడికి రాకపోవడానికి డబ్బులు లాకపోవడమే కారణం. నీకియ్యాల్సింది యియ్యకుండా ఏ మొకం పెట్టుకొని వచ్చేది చెప్పకా? ఈ పది రోజులుగా చేతిలో నయాపైసాలాక నీబోటోళ్ల దగ్గిర వందా రెండొందల పూలు కూడా కొనడంలా. నేనూ మా ఇంటాయనా పెద్ద పూలకొట్లకాణ్ణించి పూలు తెచ్చుకుని, పొగులు పొద్దస్తం మూరలు కట్టి, మూరకు పదిపైసల లెక్కన అయిదో పదో సంపాదించినా అవి బిడ్డల జరాలకే అయిపోతా ఉన్నాయి. నిజంగానే కర్మ పట్టుందకా మాకు. మొన్న మా ఇంటాయన శ్రావణమాసం సీజను గదా రెడిమేడ్ దండలు అమ్ముడుపోతాయి అని అరువులో పూలు తెచ్చినాడు. రెడిమేడ్ దండలు కట్టినాము. బేరాలు రాలా. సగం కూడా అమ్ముడుపోలా. మరుసటి రోజు అమ్ముకునేదానికి అవి కట్టైలు కాదు కదకా. ఏం చేసేది? కట్టిన దండలన్నింటినీ చేతులారా వరవలో పారేసినాము. యిట్టా ఏం వస్తదో ఏం రాదో తెలీని పూలమ్ముకునే బతుకులు పగోనికి కూడా వద్దకా' అంటా కడుపులోని బాదంతా కరిగిపోయేలా ఏడ్చింది రిహానా.

ఆ పూలమ్మే ఆమె బాద చూసి ఈ పూలమ్మే ఆమె ఏమి చేయగలదు- కళ్ళమ్మట నీళ్లు నింపుకోవడం తప్ప.